నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 05, 2023 | www.navatelangana.com

వృత్తి శిక్షణ కోర్సులకు శిక్షకుల ఎంపిక

నవతెలంగాణ-మందమర్రి

సేవా సమితి వృత్తి శిక్షణ కోర్సుల శిక్షణకు అర్హులైన శిక్షకులను ఎంపిక చేశారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభించబోవు వృత్తి శిక్షణ కోర్సులు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్ శిక్షకుల కొరకు బుధవారం ఇల్లందు క్లబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కోర్సులకు 32 మంది దరఖాస్తు చేసుకోగా 29 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. సేవా సమితి కో-ఆర్డినేటర్ హైదరాబాద్ శివకుమార్, రాజశేఖర్ జెఐ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ వారు హాజరయ్యారు. వీరిలో నుండి 13 మందిని శిక్షకులను ఎంపిక చేశామని ఎస్‌ఓటు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈ డిజీఎం రాజన్న, ఆర్పిఎస్ ఆర్కె ప్రసాద్ డివైజీఎం ఎఫ్‌అండ్‌ఎ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డివై పిఎం ఎండి ఆసిఫ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని అడ్డుకున్న కార్మికులు

నవతెలంగాణ - బెజ్జూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ వారం రోజుల నుండి సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక మధ్యాహ్నభోజన కార్మికులతో భోజనాన్ని వండిస్తుండగా విషయం తెలుసుకున్న కార్మికులు వెళ్లి అడ్డుకున్నారు. తాము సమ్మెలో ఉన్నామని, మధ్యాహ్న భోజనాన్ని వేరే వారితో ఎలా వండిస్తారని ప్రశ్నించారు. దీంతో తమకు ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయని, మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని, అందుకే తాత్కాలిక కార్మికులతో భోజనాన్ని వండిస్తున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు వేరే వారితో వండించకూడదని అడ్డుకున్నారు.

పథకాలే మళ్లీ గెలిపిస్తాయ్..!

- అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి
- ప్రతిపక్షాల మాటలకు ఆగం కావద్దు
- అచ్చేదిన్ కాదు..సచ్చేదిన్ రోజులు
- నిర్మల్ జిల్లా పర్యటనలో మంత్రి కేటీఆర్ రూ.1157కోట్ల పనులకు అంకురార్పణ
- గులాబీమయంగా మారిన జిల్లా కేంద్రం

నవతెలంగాణ- దిలావర్‌పూర్

ప్రజా సంక్షేమం కాంక్షించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే మరోసారి బీఆర్‌ఎస్‌ను గద్దెనెక్కిస్తాయని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల మాటలకు ఆగం కాకూడదని అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వస్తే అచ్చేదిన్ తీసుకొస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం సచ్చేదిన్‌ను తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ దొందు దొందేనని ఆ పార్టీలను నమ్మకూడదని సూచించారు. బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ మరో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి రూ.1157కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత హెలిక్యాప్టర్‌లో గుండంపల్లి గ్రామానికి చేరుకున్న మంత్రి స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ నెంబర్ 27 లక్ష్మీ నరసింహా ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేసి రైతులకు అంకితం చేశారు. దిలావర్‌పూర్ శివారులోని డెలివరీ సిస్టర్న్‌ను ప్రారంభించారు. అనంతరం సోన్ మండలం పాత పోచంపహాడ్ గ్రామం వద్ద 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి మంత్రులు శంకుస్థాపన చేశారు. నిర్మల్ పట్టణంలోని సమీకృత మార్కెట్, మిషన్ భగీరథ పనులను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మిని స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమర్థవంతమైన నాయకుడని, ఆయన నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో పథంలోకి తీసుకువెళ్తుందని తెలిపారు. నిర్మల్ జిల్లా అభివృద్ధికి ఇంద్రన్న ఎల్లవేళలా కృషి చేస్తారని ఆయన కృషితో కలెక్టరేట్, 300 పడకల ఆసుపత్రిని ఏర్పాటయిందని గుర్తుచేశారు. ఈ ఆసుపత్రితో ఎందరో డాక్టర్లు, వివిధ ఉద్యోగులకు జీవనోపాధి కల్పిస్తుందని, కార్పొరేట్ స్థాయి వైద్యం నిర్మల్ లోనే అందుతుందన్నారు. ఇలాంటి అభివృద్ధి చేసే నాయకుడిని మీరు మళ్ళీ ఆశీర్వదించి గెలిపించుకోవాలని అన్నారు. మంత్రి రాక సందర్భంగా జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పట్టణం గులాబీమయంగా మారింది.



ప్రతిపక్షాల మాటలకు ఆగం కావద్దు

ప్రతిపక్ష పార్టీల మాటలకు ఆగం కాకూడదని వాళ్ళు ఎంత గాబరా జేసినా అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను చూసి ఓర్వలేక ఏం మాట్లాడాలో తెలియక ప్రతిపక్షాలు ఆగమాగమవుతున్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉచిత కరెంటు అందిస్తున్నా కాంగ్రెస్ నాయకులు కరెంటు ఎక్కడ కనబడుతోంది అని హాస్యాస్పదంగా మాట్లాడుతున్నారని వారు ఆ కరెంటు తీగలను ముట్టుకుంటే కరెంటు ఉందా లేదా తెలుస్తుందని చెప్పారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం అంటున్న కాంగ్రెస్ డెబ్బై ఏండ్ల పాలనలో ఏం అభివృద్ధి చేసిందో చూపాలని సవాలు చేశారు.

అచ్చేదిన్ అని సచ్చేదిన్ తెచ్చారు

ప్రధాని మోడీ అచ్చే దిన్ అంటూ సచ్చేదిన్ తీసుకొచ్చారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. నల్ల ధనం బయటకి తీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి ఎవరి ఖాతాలో కూడా ఒక్క రూపాయి వేయలేదని ఎద్దేవా చేశారు. ఒకే రైల్వే లైన్ పనులను వచ్చిన ప్రతిసారి చూపించి ఫోజులు ఇవ్వడం తప్పా వాళ్ల చేసిందేమీలేదని కొట్టిపారేశారు. అధికారంలోకి రావడానికి బీజేపీ ఏవేవో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మొహం చాటేస్తారని ప్రజలకు తెలియజేశారు.



బీఆర్‌ఎస్ పథకాలే మళ్ళీ గెలిపిస్తాయి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, చేపట్టిన పనులను చూసి ప్రజలు మళ్ళీ ఆశీర్వాదిస్తారని మంత్రి కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా ఉన్నాయని తెలిపారు. రైతుల రుణమాఫీ, రైతు భీమా, కల్యాణ లక్ష్మీ, షాధీముభారక్, కేసీఆర్‌కిట్ తదితర పథకాలు ప్రభుత్వానికి ఎనలేని వన్నె తీసుకొచ్చాయని తెలిపారు.

15 సంవత్సరాల కల సాకారమైంది

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నిర్మల్‌వాసుల 15 సంవత్సరాల కల సాకారమైందని ముఖ్యమంత్రికి నిర్మల్ జిల్లా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నిర్మల్ జిల్లాలోని పలు మండలాలు సశ్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన, సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల కృషితో సక్సెస్ అయిందని పేర్కొన్నారు. ఇదే జోష్‌తో ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఇరిగేషన్ చైర్మన్ వేణుగోపాల చారి, జెడ్పి చైర్మన్ విజయలక్ష్మి రామకిషన్‌రెడ్డి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడెం నగేష్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్, నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపెల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పి కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, గ్రంథాలయ జిల్లా చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, ప్రముఖ కాంట్రాక్టర్ మురళీధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క డబుల్ బెడ్ రూం ఇచ్చిన దాఖలు లేవు



నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఇండ్లు, ఇంటి స్థలాలు ఇచ్చామని, తెలంగాణ వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ అధికారంలోకి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న ఒక డబుల్ బెడ్ రూం కూడా ఇవ్వలేదని ఆ పార్టీ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో బుధవారం కుక్కర్ల పంపిణీ కార్యక్రమంలో సతీమణి కంది సాయి మౌనరెడ్డితో కలిసి పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు కంది శ్రీనివాసరెడ్డి దంపతులకు ఘన స్వాగతం పలికారు. పోషకాహారంతో కూడిన ఆహారం అందించాలనే ఉద్దేశంతోనే కుక్కర్లు పంపిణీ చేస్తున్నట్టు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని గడప గడపకు ప్రెషర్ కుక్కర్లు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీల గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, బాపురావ్ హుల్కే, సంజయ్ గుండావార్, రాజ్ మహ్మద్, శంకర్ భోక్రే, రూప్‌రావు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

యువకులు ఆటల్లో రాణించాలి



జైపూర్ : యువకులు ఆటల్లో రాణించాలని షెట్‌పల్లి సర్పంచ్ మేడి రవి అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధి యువకులకు ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం విద్య, వైద్యం, ఉద్యోగం ఉపాధితో పాటు యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు, దుస్తులు పంపిణీ చేయడంతో పాటు స్థానిక పాఠశాల విద్యార్థులకు స్కిప్పింగ్ రోప్‌లు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు ఆట పాటల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జంతు దినోత్సవం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ జంతువు దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో జీవరాసుల ప్రాముఖ్యత, జంతు రక్షణపై కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జీవశాస్త్ర అధ్యాపకుడు శివ ప్రసాద్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, వెంకటరమణ, అధ్యాపకులు నరేష్, సుజాత, హెచ్ జలంధర్, వైష్ణవి పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో పింఛన్ దారుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి కిషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత కార్మికులు తదితర పింఛన్ దారులు సెల్ నెంబర్ 8186000940ను సంప్రదించాలని సూచించారు. ఈ ఫోన్ నెంబర్ అన్ని పని దినాలలో కార్యాలయ సమయంలో ఉదయం 10:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు.

ఈ-పంచాయితీ ఆపరేటర్లపై వివక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని శాఖల ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందని, ఈ-పంచాయితీ ఆపరేటర్లపై సవతి తల్లి ప్రేమ చూపించడం బాధాకరమని ఉద్యోగులు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం ఆరవ రోజుకు చేరుకుంది. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-బోథ్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించిన ఘటన బుధవారం మండలంలోని సొనాలలో జరిగింది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం... సొనాలకు చెందిన వొడ్నాల విఠల్ కుమారుడు సాయితేజ(19) సొనాల నుంచి బైక్‌పై గుర్రాల తండా వైపు వేళ్తున్నాడు. మూల మలుపు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతునితో పాటు సొనాలకు చెందిన చౌహాన్ నరేష్ స్వల్ప గాయాలయ్యాయి. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఓపెన్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ (టీఓఎస్) విధానంలో అడ్మిషన్ల కొరకు గడువు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖధికారిణి ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ, తరగతి, ఇంటర్ విద్యార్థుల అడ్మిషన్లకై ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ. వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అడ్మిషన్ ఫీజు చెల్లించి రశీదు పొంది, సంబంధిత అధ్యయన కేంద్రాలలో అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో పాటు ధృవపత్రాలను సమర్పించాలని సూచించారు.

పశువుల కాపరులపై అటవీ అధికారి దాడి



తమ గోడు వెళ్లబోసుకుంటున్న పశువుల కాపరులు

నవతెలంగాణ-భీమారం

పశువుల కాపరులపై ఓ అటవీ అధికారి దాడి చేసిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన లావుడియా శ్రీనివాస్, దేశం మల్లేష్ దినసరి చర్యలో భాగంగా పశువులను తోలుకొని గొల్లవాగు ప్రాజెక్ట్ సమీప అడవిలోకి వెళ్లారు. సాయంత్రం బూరుగుపల్లి ఎఫ్ఎస్ఓ మరో ఐదుగురితో కలిసి వాహనంలో వచ్చి కాపరులపై దాడి చేశారు. భీమారం గ్రామానికి చెందిన పశువుల కాపరులమని వేడుకుంటున్నప్పటికీ వదిలి పెట్టకుండా ఇష్టం వచ్చినట్టు దుర్భాషలాడుతూ దాడి చేశారు. అంతటితో ఆగకుండా కులం పేరుతో దూషించి దిక్కున్న చోట చెప్పుకొమ్మంటూ వారి వద్ద ఉన్న రూ.7వేలు లాక్కెళ్లారు. దీనిపై పశువుల కాపరులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాపరులపై దాడిని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీనివాస్ ఖండించారు. లంబాడీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై దాడి చేసిన అటవీ శాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సెక్షన్ అధికారి అల్తాఫ్ హుస్సేన్‌ను వివరణ కోరగా దాడి జరిగింది నిజమేనని, కానీ దేశం మల్లేష్ చేతిలో గొడ్డలితో పాటు వేట కుక్కలు అనుమానాస్పదంగా కనిపించాయన్నారు. తనది అదిలాబాద్ అని తన మామ ఆరోగ్యం బాగ లేకపోవడంతో పశులను మేపడానికి వచ్చానని, అనుమానాస్పదమైన సమాధానం ఇచ్చాడని తెలిపారు. వన్యప్రాణి పరిరక్షణలో భాగంగా పైఅధికారి డీఎఫ్ఓ పరిశీలనలో భాగంగా అనుమానితుడి వద్ద నుంచి గొడ్డలి తీసుకొని సెల్ సీజ్ చేశామని తెలిపారు. ఎలాంటి డబ్బులు తీసుకోలేదని వివరించారు.

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా మధ్యాహ్నం భోజన కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే పెరిగిన వేతనాల చెల్లింపుకు బడ్జెట్ విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూకు అదనపు బడ్జెట్ కేటాయించాలని లేదా పాత మెనూనే కొనసాగించాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, గ్యాస్‌కు ప్రభుత్వమే పూర్తి సబ్సిడీ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు వెంటనే అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు. కార్మికులకు ప్రమాద బీమాతో పాటు, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా నాయకుడు కృష్ణమాచారి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల నాయకులు, వనమాల, నవీన్ కుమార్, ప్రణీత, ఆత్రం లక్ష్మీ శ్యామల, నాగుల పుష్ప, అనుమాండ్ల సరోజన, పడిగెల శైలజ, ఏనగంటి మమత, విజయ, భీంబాయి, కుమురం, రంభ, గిరిబాబు, మనబోతుల లక్ష్మీ, వెడ్మ ఊర్మిళ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ ముందు భోజన కార్మికులు

మహిళా శక్తి కేంద్ర వాలంటీర్ల సేవలు అభినందనీయం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాలలో మహిళా సంక్షేమం, బాల్యవివాహాల నిర్మూలన, విద్య, వైద్యం, పోషకాహారంపై మహిళ శక్తి కేంద్ర వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కేంద్ర ప్రతినిధులకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కేంద్రం పథకంలో భాగంగా గ్రామాలలో మహిళలు, విద్యార్థినిలు వాలంటీర్లుగా సేవలు అందించడం సంతోషంగా ఉందని, మహిళలు, విద్యార్థినిలు, బాల బాలికలకు అందిస్తున్న పోషణ పదార్థాలపై అవగాహన కల్పించడం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, రక్తహీనత గల బాలింతలు, తక్కువ బరువు గల పిల్లలను గుర్తించి వారికి సకాలంలో సరైన పోషక పదార్థాలు అందించడంలో వాలంటీర్ల పాత్ర చాలా కీలకమైనదని పేర్కొన్నారు. కిశోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచడం అభినందనీయమని అన్నారు. అనంతరం వివిధ మండలాలలో సేవలు అందిస్తున్న వాలంటీర్లకు మెమొంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సిడిపిఓ రుక్సానా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డిఓ రాజేశ్వర్ సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కాగజ్‌నగర్ ఆర్‌డిఓ రాజేశ్వర్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆసిఫాబాద్ ఆర్‌డిఓ సురేష్ అన్నారు. రాజేశ్వర్ గుండెపోటు కారణంగా మృతి చెందడంతో బుధవారం కలెక్టరేట్‌లో సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ ఆర్‌డిఓ రాజేశ్వర్ మృతి చెందడం విచారకరమని, రెవెన్యూ శాఖలో ఆయన లేని లోటు కనబడుతుందని తెలిపారు. అందరితో స్నేహపూర్వకంగా మెదిలే వారని తెలపిఆరు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, రిటైర్డ్ తహసీల్దార్లు రమేష్‌గౌడ్, అమృత్‌సాగర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రఫత్ హుస్సేన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

- పలు శాఖల అధికారులు డుమ్మా

నవతెలంగాణ-కెరమెరి

ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. హాజరు కావాల్సిన రెవెన్యూ, విద్యాధికారితో పాటు పలువురు అధికారులు గైర్హాజరు కావడం, కింది స్థాయి ఉద్యోగులను పంపి చేతులు దులుపుకున్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే సర్వ సభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరై తమ పూర్తి స్థాయి నివేదికలను, చేపట్టిన అభివృద్ధి వివరాలను సమావేశం ముందు వెల్లడించాల్సి ఉంటుంది. సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసిన ప్రతిసారి అధికారులు గైర్హాజరు కావడం, కింది స్థాయి ఉద్యోగులను పంపడమే తంతుగా కొనసాగుతుంది. ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశంలో ప్రశ్నించాలని భావించిన ప్రజాప్రతినిధులు నిరుత్సాహనికి గురయ్యారు. మొదట ఐకెపి, వ్యవసాయ, పీఆర్, ఐసిడిఎస్‌కు సంబంధించిన అధికారులు తమ నివేదికలను సభ ముందు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ పెందూర్ మోతీరాం మాట్లాడారు. ఈ నాలుగేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో అంతర్గత రోడ్లు, షెడ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు, నిధుల మంజూరు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, ఎంపిడిఓ మహేందర్, ఎంపిటిసి ఇఫ్తేకార్, సర్పంచులు రజిత, జగన్నాథ్, కావుడే తులసీరాం పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చే కానుకలు శాశ్వతం కాదు

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఎన్నికల ముందు ఇచ్చే కానుకలు శాశ్వతం కాదని, సీఎం కేసీఆర్ అందించే సంక్షేమ పథకాలు, కానుకలు మన కుటుంబానికి అండగా ఉంటాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ చీరల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిని చాటేల ప్రభుత్వం బతుకమ్మ పండుగకు కానుకలను అందిస్తుందన్నారు. మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి భారత దేశనిదాని, ఇలాంటి చోట మత ఘర్షణలు, మానవత సంబంధాలను తెంచుకునేలా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో పండగలు మత సమరస్యానికి నిలయంగా మారుతున్నాయన్నారు. మహిళా ఆత్మ గౌరవ నిలింపేలా పోడు భూముల పట్టాలు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, అమ్మఒడి, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, డబల్ బెడ్ రూమ్, వితంతు పింఛన్లు, వంటి పథకాలు సైతం మహిళల పేర్లపై అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, మార్కెట్ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు, సేవ్వ జగదీష్, మండల అధ్యక్షుడు రమణ, కుమ్రం రాజు, గంగయ్య యాదవ్, పీఎసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, ఎంపీటీసీ బిక్కీ గంగాధర్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఐకేపీ ఏపీఎం శుద్దోధన్ పాల్గొన్నారు.

ఎక్స్‌పో ఎగ్జిబిషన్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-జైనథ్

6 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఎక్స్‌పో ఎగ్జిబిషన్ పోస్టర్లను ఎంపీడీఓ గజానాన్ విడుదల చేశారు. బుధవారం మండల ఫోటోగ్రాఫీ అసోసియేషన్ సభ్యులు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసి పోస్టర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా మండల ఫోటోగ్రాఫీ అధ్యక్షులు తప్రే శ్రీకాంత్ మాట్లాడుతూ 6 నుంచి 8వ తేది వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అఖిల్, గౌరవ అధ్యక్షుడు తొగరి అశోక్, కుంట అఖిల్ రెడ్డి, విశాల్, సన్నీ, సతీష్ రెడ్డి, శ్రీకాంత్, చందు, మున్నా, రజినీకాంత్, జి.రాకేష్ పాల్గొన్నారు.



నేడు వివేకానందుని విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతకు ఆదర్శప్రాయుడైన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయనున్నారు. 2014లో వివేకానంద విగ్రహ ఏర్పాటుకు యువజన సంఘాలు ముందుకు వచ్చాయి. డైట్ మైదాన ఎదుట కళాకారుడు ఉరే గణేష్ 9 ఏండ్లగా విగ్రహాన్ని తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే అనేక అడ్డంకులు, విమర్శలు వచ్చిన వాటిని అధిగమిస్తూ పూర్తి చేశారు. అయితే గురువారం విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలకు ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ఆవిష్కరించనున్నట్లు యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ అన్నారు. గురువారం నిర్వహించే విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేయాలని బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లా కేంద్రంలో 24 అడుగుల స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నూతన మండలంగా మాలేగాం

- సంబరాలు జరుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-కుభీర్

మాలేగాంను ప్రభుత్వం నూతన మండలంగా ప్రటిస్తు జీఓను విడుదల చేసింది. బుధవారం జీఓను స్వాగతిస్తూ గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. నూతన మండల పరిధిలోని 15 గ్రామాల ప్రజలు మలేగాంకు చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో పాటు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఐకే రెడ్డిలకు ధన్యవాదలు తెలిపారు. పాలపన సౌలభ్యం కోసం చిన్న మండలాలను ఏర్పాటు చేయాలని కుభీర్‌లోని ఆయా గ్రామాల ప్రజలు విన్నవించారని, ప్రభుత్వం స్పందించి నూతన మండలంగా మలేగాంను ఏర్పాటు చేయడం హర్షనీయమని ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ రేకుల గంగా చరణ్, సర్పంచ్ మహిపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఉద్యోగ భద్రతతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్లతో 104 సేవల ఒప్పంద ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. బుధవారంతో ఈ దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గర్భిణులకు రక్త పరీక్షలు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్, రీక్షలు, నెలకు సరిపడా మందులను ఇవ్వడం జరిగిందన్నారు. ఇలాంటి 104 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయటంతో ఆ వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులను ఏరియా ఆస్పత్రి వంటి వాటిలో తాత్కాలికంగా సర్దుబాటు చేసి నేటికీ 22 నెలలు గడుస్తున్నాయన్నారు. 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. అదే విధంగా వేతనాలలో కూడా చాలా వ్యత్యాసం ఉందన్నారు. 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరితో పని చేయిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ట్రెజరీ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-తాంసి

గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడా పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు క్రీడా పరికరాలతో పాటు మహిళలకు బతుకమ్మ పండుగ చీరలను తహసీల్దార్ లక్ష్మీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో ఇప్పటికే గ్రామాల్లో క్రీడా ప్రాంగాణలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం తరపున ఆట వస్తువులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే మహిళలకు బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బతుకమ్మ చీరలను అందుస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భూమయ్య, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడి, సర్పంచులు స్వప్న రత్న ప్రకాష్, సదానందం, వెంకన్న, భరత్, పార్టీ కన్వీనర్ అరుణ్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, అశోక్, రఘు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి తోటి ఉద్యోగుల అండ

బజార్‌హత్నూర్: ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. మండలంలోని జాతర్ల సబ్ సెంటర్ రాంనగర్‌కు చెందిన కోట్నక్ భూమ్‌బాయ్ గత 25 సంవత్సరాలుగా ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తోటి వైద్య సిబ్బంది, స్థానిక వైద్యాధికారి భీంరావు బుధవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.26,500 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భీంరావ్ మాట్లాడుతూ తోటి ఉద్యోగుల కుటుంబాలకుఉద్యోగులు ఆర్థికంగా అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భాస్కర్ రావు, హెచ్ఈఓ సూర్య ప్రకాష్, పీహెచ్ఎన్ సుశీల, హెల్త్ సూపర్ వైజర్లు జె.దేవిదాస్, ఉల్దారాణి, ఏఎన్ఎంలు జమున, శ్రీదేవి, అర్చన, 102 క్యాప్టెన్ నవీన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మరణించిన ఆశా కుటుంబాన్ని ఆదుకోవాలి

- నేడు కలెక్టరేట్ ముట్టడికి ఆశాల పిలుపు



ఆశా కార్యకర్త చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రమాదంలో గాయపడి మరణించిన ఆశా కార్యకర్త కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 10వ రోజుకు చేరుకోగా సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మరణించిన ఆశా కార్యకర్త గీత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడి మరణించిన కార్యకర్త కుటుంబాన్ని ఆదుకునేల ప్రభుత్వం కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పది లక్షల బీమా వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ, బీమా సౌకర్యాలు లేక ఆశ కార్యకర్తలు మరణించిన కుటుంబాలకు ఎలాంటి ఆసరా లేకుండా పోతుందన్నారు. ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యలు పరిష్కరించేల యూనియన్ బృందంతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, నాయకులు ఆశ, పార్వతి, లక్ష్మీ, స్వప్న, పద్మ, పుష్ప, సునీత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతు

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఆశ వర్కర్లు ప్రాణాలకు తెగించి ప్రతి ఇంటింటికి తిరిగిన వీరిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ప్రభుత్వం ఆశా వర్కర్లను పర్మెంట్ చేస్తాం, జీతాలు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. పది రోజులు సమ్మె చేస్తున్న వారికి భరోసా ఇచ్చేల ప్రభుత్వం తరపున ఏ ఒక్క నాయకుడు రాకపోవడం ఆశ వర్కర్ల మీద ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, రసం కిష్టు, మాజీ ఎంపీటీసీ భూమన్న, జైనథ్ ఆదిలాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగన్న, నర్సింగ్, తుడం వినోద్, దండు మధుకర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆశా కార్యకర్తలు ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సంయుక్త కార్యదర్శి పవార్ జితేందర్, ఆశా కార్యకర్తల సంఘము నాయకురాలు లక్ష్మీలలిత, సురేఖ, గంగమ్మ పాల్గొన్నారు.



ఇచ్చోడలో భిక్షాటన

క్రైస్తవులకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

క్రైస్తవులకు రాజకీయ గుర్తింపునిచ్చిన పార్టీలకే ఈసారి ఎన్నికలలో క్రైస్తవులు ఓటు వేస్తారని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసిఎఫ్) ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి క్రైస్తవ ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం కోసం సకల జనులతో పాటుగా క్రైస్తవులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే అందరితో పాటుగా తమ బతుకులు కూడా మారుతాయని క్రైస్తవులు విశ్వసించారని తెలిపారు. కానీ నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవులు ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. జనాభా దామాషా ప్రకారం సంక్షేమ పథకాలు లేవని, అభివృద్ధి అంతకన్నా లేదని తెలిపారు. రాజ్యాంగంలోని 25వ ఆర్టికల్ ప్రకారం మత స్వేచ్ఛ హక్కులు హరించబడుతున్నాయని పేర్కొన్నారు. రోజురోజుకు క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ, నలభై మండలి, 17 పార్లమెంటు, 7 రాజ్యసభ స్థానాల్లో క్రైస్తవులు ఒక్కరు కూడా లేరని తెలిపారు. వివిధ కార్పొరేషన్లలోనూ, స్థానిక సంస్థల్లోనూ క్రైస్తవులకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. ఈసారి రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికలలో క్రైస్తవులకు చట్ట సభలలో అవకాశాలు కల్పించే పార్టీలకే ఓటు వేస్తామని తీర్మానించారు. కార్యక్రమంలో ఏఐసిఎఫ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్లు టిడియస్, వనితా అలెగ్జాండర్, డి. మంగేశ్వరి, దళిత క్రైస్తవ ప్రతినిధులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న విజయరాజు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాలలో రాణించాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం ఉట్నూరు కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడోత్సవాల్లో డీడీ దిలీప్ కుమార్‌తో ఆమె పాల్గొన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలన్న ఉద్దేశంతో జోనల్ స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 1200 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నారన్నారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, క్యారం, చెస్, టెన్నికాయిట్ వంటి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలలో అన్ని వసతులు కల్పించడం జరిగుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులు చదివే గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా డీటీడీఓ అంబాజీ, గిరిజన క్రీడలాధికారి పార్థసారథి, ఏటీడీఓలు క్రాంతికుమార్, నిహారిక, అమిత్ కుమార్, ఏసీఎంఓ జగన్, అధికారులు, వ్యాయమ ఉపాధ్యాయులు, కీడ్రాకారులు పాల్గొన్నారు.



మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

- డాక్టర్ రవికిరణ్ యాదవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించేల అందించే వృత్తి నైపుణ్య శిక్షణాలను సద్వినియోగం చేసుకోవాలని సాయివైకుంఠ ట్రస్టు చైర్మన్, ప్రముఖ హోమియోపతి వైద్యులు డా. రవికిరణ్ యాదవ్ అన్నారు. బుధవారం ట్రస్టు భవనంలో మూడు నెలల పాటు అందిస్తున్న శిక్షణను పూర్తి చేసుకుంటున్న అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధికి ప్రభుత్వ పరంగా ఉన్న సదుపాయాలను పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు బ్యాంకు రుణాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డా.రవి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిలో శిక్షణాలు పొంది కుటుంబానికి ఆర్థిక చేయూతగా ఉండాలనే లక్ష్యంతో ట్రస్టు తరపున టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటిషియన్ తదతర వాటిలో ఉచితంగా శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, యువకుతు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ సల్ల విజయబాబు, ట్రస్ట్ మేనేజర్ రవి, శ్రీనివాస్, మహేందర్, శిక్షకురాళ్లుపెందూర్ లక్ష్మీ, అందుగుల శ్రావణి, పూజ రాథోడ్, ఓరుగంటి వీణ పాల్గొన్నారు.



బతుకమ్మ చీరలు పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మహిళలకు బతుకమ్మ చీరలతోపాటు మండలంలోని 36 యువజన సంఘాలకు వాలీబాల్ క్రికెట్ క్రీడ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీఓ దిలీప్ కుమార్, సుంకిడి సర్పంచులు మహేందర్ యాదవ్, రుయ్యాడి పూత రెడ్డి, రత్నాపూర్ రాంబాయి, అరిలికే నారకస్తు, ఐకెపి పీఓ స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్యాణం రాజేశ్వర్, ఎంపిటిసి గౌరమ్మ వెంకన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శులు యువజన సంఘం సభ్యులు వివిధ శాఖల అధికారులు మహిళలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబరిపేట్ గ్రామంలో హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి బుధవారం సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. లైట్ల ఏర్పాటుతో ప్రధాన చౌక్‌లో వెలుగు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లయ్య, కార్యదర్శి వంశీ, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజ్, కట్ల వెంకటరమణ, కొమ్ము మహేష్, కొప్పుల శ్రీనివాస్, లచ్చన్న పాల్గొన్నారు.

కోలాహలంగా రుషి పంచమి వేడుకలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మధురల ఆరాధ్య దైవం జ్వాల ముఖి, కాలు బాబా, పాచు బాబా ఆలయములో రుషీ పంచమి వేడుకలు అట్టహాసంగా కొనసాగుతుంది. ఆలయ పీఠాధిపతి శ్రీశ్రీరాంసింగ్ మహారాజ్ ఆధ్వర్యములో ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవానికి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి మధుర భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయ, వాయిద్యాలతో నృత్యాలు చేశారు. ఈ వేడుకలతో గ్రామంలో ఒక జాతర వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు గ్రామస్థుల ఆధ్వర్యములో అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకలు రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు కొసాగుతాయి. కాగా బుధవారం పెంబి జడ్పీటీసీ భూక్యా తానుబాయి హాజరై పూజలు చేశారు.

డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అరెస్ట్

నవతెలంగాణ-సారంగాపూర్

రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిర్మల్ జిల్లా పర్యటన దృశ్య బుధవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును పోలీసులు అరెస్టు చేశారు. తన నివాసం నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు స్టేషన్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. పోలీసులతో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని పార్టీ శ్రేణులు మండిపడ్డారు. ఈ ఆందోళనలో నర్సయ్య హథి, భీంరావ్ నాయక్, రమణ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాజేందర్, అరవింద్, రాజు లింగారెడ్డి, విలాస్ రావ్ పాల్గొన్నారు.

10న జిల్లాకు కేంద్రమంత్రి అమిత్‌షా రాక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 10న జిల్లాలో కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటించనున్నట్లు ఎంపీ సోయం బాపురావ్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త ముందుండి జన సమీకరణ చేసి పార్టీ తెలంగాణలో అధికారం దిశగా సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఈనెల 10న మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించే సభలో సుమారు లక్ష మంది కార్యకర్తలు వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ రాష్ట్రంలో జరుగుతున్న బీఆర్ఎస్ పరిపాలన అంతం చేయడానికి, అవినీతి పరిపాలనపై పార్టీ పోరాడుతూంటుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని డైట్ గ్రౌండ్‌లో సభ ప్రాంగణాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-బేల

విద్యా సంస్థలకు వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను వాడడం నేరమని కృష్ణవేణి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు దినేష్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని డోప్టాల గ్రామంలోని పాఠశాలను పొగాకు రహిత విద్యాసంస్థగా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు, ధూమపానానికి, మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాలలకు 100 గజాల పరిధిలో గల దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం, పొగాకు రహిత విద్యాసంస్థల నియమావళి ప్రకారం నేరామన్నారు. నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి

నవతెలంగాణ-జైనథ్

ఆధార్ ప్రామాణీకరణతోనే సీసీఐ ద్వారా పత్తికి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7020 ఇస్తున్నట్లు ఏఎంసీ కార్యదర్శి మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండించిన పత్తిని సీసీఐకి విక్రయించడానికి ఆధార్ తప్పని చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వారి ఆధార్‌కు మొబైల్ నెంబర్, ఇతర సవరణలు చేసుకోవాలని సూచించారు. అప్‌డెట్ చేసిన బ్యాంకు ఖాతాకు నంబర్‌ను అనుసందానం చేయాలన్నారు. లేనిపక్షంలో కొనుగోలు చేయరని పేర్కొన్నారు.

కేటీఆర్‌కు పాఠశాల స్వీపర్ల వినతిపత్రం

నవతెలంగాణ-కడెం

సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తన్న అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు హాజరైన రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే తమకు భద్రత కల్పించేల కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ బాబు, కార్యదర్శి గంగన్న, లక్ష్మీ, నర్సయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవనతతెలంగాణ-దహెగాం



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు మధ్యాహ్నభోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు లలిత, శంకరమ్మ, లక్ష్మీ, పార్వతి, విజయ పాల్గొన్నారు.

బిచ్చగాళ్లుగా మార్చుతున్న ప్రభుత్వం

నవతెలంగాణ-దహెగాం



ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ తమను బిచ్చగాళ్లుగా మారుస్తుందని ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు శోభ అన్నారు. 10వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని దుకాణ సముదాయాల్లో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పుష్ప, సులబ, మమత, సంగీత, సుజాత, వనిత, రజిత, అనసూర్య భాగ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నా

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

వతెలంగాణ-కాగజ్‌నగర్

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఇచ్చిన హామీకి తాను కట్టుబడి ఉన్నానని సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పునరుద్ఘాటించారు. బుధవారం స్థానిక మిల్లు గేటు ముందు ఉదయం ఏడు గంటలకు కార్మికులతో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు తాను గతంలో రూ.35 వేలు ఇప్పిస్తానని హామీ ఇచ్చాననీ, కాని యాజమాన్యం కేవలం రూ.3 కోట్లు మాత్రమే మంజూరు చేయడంతో కార్మికులకు నష్టం జరిగే అవకాశముందని అన్నారు. సుమారుగా రూ.6 కోట్లు విడుదల చేస్తే తప్ప కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగే అవకాశం లేదని, ఈ విషయాన్ని తాను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోయి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఒకవేళ యాజమాన్యం స్పందించని పక్షంలో స్వయంగా తానే మిల్లు గేటు ముందు రిలే దీక్ష చేపడుతానని అన్నారు. కార్మికులు అధైర్యపడవద్దని అభయం ఇచ్చారు. కార్మికులకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే తాను యాజమాన్యం చేపడుతున్న కార్మిక వ్యతిరేక చర్యలను భరించానని, ఇక నుంచి సహించబోనని అన్నారు. మిల్లులో స్థానిక యువతకే ఉపాధి అవకాశాలు కలిగేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం ఛైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ విజయ్‌యాదవ్, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పీఏసీఎస్ డైరెక్టర్ రాజీనామా

- సిర్పూరు(టి)లో అధికారపార్టీకి వరుస రాజీనామాలు

నవతెలంగాణ-సిర్పూరు (టి)

సిర్పూరు(టి)లో అధికారపార్టీ నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. ఇటీవలే జడ్పీటీసీ నీరటి రేఖ-సత్యనారాయణ దంపతులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెల్సిందే. తాజాగా సిర్పూరు పీఏసీఎస్ డైరెక్టర్ నగరాడె రాజు-స్వాతి దంపతులు కూడా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజు పీఏసీఎస్ డైరెక్టర్‌గా కొనసాగతున్న స్వాతి సిర్పూరు-2 ఎంపీటీసీగా గతంలో కొనసాగారు. స్థానిక ఎమ్మెల్యే కోనప్ప తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పీఏసీఎస్ ఛైర్మన్‌గా తాను పోటీ చేసినా తనకు మద్దతివ్వకుండా ఇతరులకు మద్దతివ్వడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం తదితర కారణాలతో తాము రాజీనామా చేస్తున్నట్లు రాజు స్పష్టం చేశారు. 2014లో కాంగ్రెస్ నుంచి సిర్పూరు-2 ఎంపీటీసీగా గెలుపొందిన స్వాతి 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో స్వాతి రెండో సారి అధికారపార్టీ తరపున ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి పాలు కాగా, రాజు పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. సిర్పూరు (టి)లో అధికారపార్టీకి చెందిన నాయకులు వరుసగా రాజీనామాలు చేస్తుండడం ఆ పార్టీ నేతలను కలవరానికి గురి చేస్తోంది.

క్రీడల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో అండర్-14 , అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ క్రీడా పోటీలను జిల్లా విద్యాధికారి అశోక్, గిరిజన క్రీడల యువజన అధికారిని రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా వెనుకబడ్డ జిల్లా అయిన కూడా క్రీడల్లో ముందుండాలని అన్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని క్రీడా పాఠశాల ఉండడం శుభ పరిణామం అని తెలిపారు. క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు ఉదయబాబు, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి సాంబశివరావు, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, కృష్ణారావు, పెట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేందర్, కృష్ణమూర్తి, పూర్ణచందర్, కోచులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్, లక్ష్మణ్, రాకేష్, ప్రదీప్, లక్ష్మి పాల్గొన్నారు.

అబద్ధపు మాటలను ప్రజలు నమ్మరు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేసీఆర్ అబద్ధపు మాటలను తెలంగాణ ప్రజలు నమ్మరని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో పార్టీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించగా దీనికి జిల్లా ఇన్‌ఛార్జి అరుముల్ల పోచం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోడీ హయాంలో తెలంగాణకు రూ.9 లక్షల కోట్లకుపై చిలుకు నిధులు కేటాయించారని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దాచి తెలంగాణ మొత్తం తన వల్లే అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్నాడని అన్నారు. సమ్మక్క, సారక్క పేర్ల మీద గిరిజన యూనివర్శిటీని మంజూరు చేయడం, తెలంగాణ ప్రజలకు పసుపు బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, నాయకులు కొంగ సత్యనారాయణ, ధోని శ్రీశైలం, కొట్నాక విజయ్, మురళీధర్, కిరణ్, అరుణ్‌లోయ, వీరభద్రచారి, ఇందూరి వెంకటేష్ పాల్గొన్నారు.

కళాశాలలో ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన పాఠశాల, కళాశాలలో బుధవారం అండర్-14, 17 విభాగంలో బాలురు, బాలికలకు జోనల్ స్థాయిలో ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్ నిర్వహించినట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ భద్రకాళి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సాంబశివరావులు తెలిపారు. ఈ సెలక్షన్‌లో కాగజ్‌నగర్, చిన్న రాస్ పెల్లి, కొంచెవెల్లి, తదితర కళాశాలల నుంచి 150 మంది క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. ఈ సెలక్షన్‌లో జిల్లా విద్యాధికారి పార్శీ అశోక్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున యాదవ్, పీఈటీలు రవి కుమార్, చిన్నక్క, వనిత, రమేష్, అజయ్, జితేందర్ పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు ఏకకాలంలో నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగున్నతులు ఏకకాలంలో నిర్వహించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖమర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, పదోన్నతులతో కూడిన బదిలీలను మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు. గత ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక అనేక మంది ఉపాధ్యాయులు నష్టపోయారని అన్నారు. వందలాది మంది స్కూల్ అసిస్టెంట్‌లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన కారణంగా అనేక ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయని, వీటిని అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల ఓట్ల కోసమే ఈ డ్రామాలు

- ఎస్పీఎం సమస్యను ఎన్నిసార్లు కేసీఆర్ దృష్టికి తీసుకుపోతారు..?
- ఎస్పీఎం మాజీ ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌హుస్సేన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ హుస్సేన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎస్పీఎం కార్మికుల ఓట్లను రాబట్టుకునేందుకే స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మరో కొత్త డ్రామాకు తెరలేపుతున్నాడని ఎస్పీఎం మాజీ ప్రధాన కార్యదర్శి, బీఎస్పీ నాయకులు షబ్బీర్‌హుస్సేన్ ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులతో ఎమ్మెల్యే సమావేశమై కార్మికులకు చెల్లించాల్సిన డబ్బుల విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయం నుండి కార్మికులకు రేపో మాపో డబ్బులు చెల్లిస్తానని చెపుతూ వస్తున్నాడని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఎంపీ, స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల సమయంలో కూడా కార్మికులకు మాయమాటలు చెప్పి వారి ఓట్లను ఎమ్మెల్యే రాబట్టుకున్నాడని విమర్శించారు. ఇప్పటి వరకు పలు పర్యాయాలు కార్మికులను హైద్రాబాద్‌కు తీసుకువెళ్లి మంత్రి కేటీఆర్‌ను కలిపించి మాయమాటలు చెప్పి తీసుకువచ్చాడని, కాని సమస్య మాత్రం పరిష్కారం కాలేదని అన్నారు. మళ్లీ ఇపుడు సమస్యను మరోసారి కేసీఆర్ దృష్టికి తీసుకుపోతానని చెప్పడం కార్మికులను మోసం చేయడమేనని అన్నారు. కంపెనీ పునఃప్రారంభమై ఐదేళ్లు కావస్తున్నా ఇంకా 200 మంది పర్మినెంట్ కార్మికులు, వేలాది మంది కాంట్రాక్టు కార్మికులకు పని దొరకలేదని, మిల్లులో కనీసం క్యాంటిన్ సౌకర్యం లేదని, తన ఆస్థులంటూ యాజమాన్యం ప్రజలు రాకపోకలు సాగించే రహదారులను మూసివేస్తున్నా ఏనాడూ మాట్లాడని ఎమ్మెల్యే ఈరోజు మిల్లు గేటు ముందుకు వచ్చి కార్మికుల కోసం రిలే దీక్షలు చేస్తానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఐదేళ్ల క్రితం ప్రతీ కాంట్రాక్టు కార్మికునికి రూ.35 వేలు ఇప్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ఇపుడు దానిని రెట్టింపు చేసి రూ.70 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

రూ. 75 వేలు చెల్లించి మాట నిలుపుకోవాలి

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు రూ. 75 వేలు చెల్లించి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట నిలుపుకోవాలని ఎస్పీఎం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోలెం వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కాంట్రాక్టు కార్మికులకు మిల్లు యాజమాన్యం నుండి రూ. 30 వేలు, తాను రూ. 5 వేలు కలిపి రూ. 35 వేలు చెల్లిస్తానని 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కోనప్ప కాంట్రాక్టు కార్మికులకు హామీ ఇచ్చాడని, ఐదేళ్లు గడిచిపోయినా ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరలేదని అన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే ప్రతీ కార్మికునికి రూ.75 వేలు చెల్లించి ఎమ్మెల్యే తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు వెంకటేష్, ఎఐటీయూసీ నాయకులు ఎకె సింగ్, ఎస్పీఎం పరిరక్షణ కమిటీ నాయకులు జాన్‌ప్రకాష్, కార్మికులు పాల్గొన్నారు.

రేపు శ్రీరాంపూర్ మహాధర్నాకు తరలిరావాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఓదెలు



సమావేశంలో మాట్లాడుతున్న ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

శ్రీరాంపూర్‌లో శుక్రవారం నిర్వహించే మహాధర్నాకు తరలిరావాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం గోలేటిలోని సీహెచ్‌పీలో కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనేక సమస్యలతో కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో కాలం నెట్టుకొస్తున్నారన్నారు. తెలంగాణ సాధించిన తర్వాత అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి సమస్యలు పరిష్కరించలేదన్నారు. 2022 సెప్టెంబర్ 26 జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలుచేయాలని, జీఓ నెంబర్ 22ను గెజిట్ చేసి కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కనీస వేతనాల జీఓను సవరించకుండా కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికుల హక్కులకై పోరాడుదామన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచి ఇవ్వాలని, అగ్రిమెంటులోని మిగిలిన అంశాలను వెంటనే అమలుచేయాలని ఈ నెల ఆరో తేదీన శ్రీరాంపూర్‌లో నిర్వహించే నిరసన దీక్షలో గోలేటి, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, ఏరియాలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన దీక్షను విజయవంతం చేయాలన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : కోనేరు కోనప్ప

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దహెగాం

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.60 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపరిచి ప్రతి గ్రామానికి విద్యను చేరువచేయాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశ్యంతో అనేక సంక్షేమ హాస్టళ్లతో పాటు ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గ స్థాయిలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేసిందన్నారు. అంతేకాకుండా నాణ్యమైన విద్యనందించడానికి ఉపాధ్యాయులను నియమిస్తూనే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను సైతం నెలకొల్పిందన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏమైనా సమస్యలున్నట్లయితే రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా కొనసాగాలని ఆకాంక్షించారు. యువకులు సైతం చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమని, మంచిగా ఆటలు నేర్చుకొని రాష్ట్రానికే పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ సులోచన, జడ్పీటీసీ శ్రీరామారావు, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, స్థానిక సర్పంచ్ పుప్పాల లక్ష్మీ, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, కోఆప్షన్ మెంబర్ హైమద్, పంచాయతీ రాజ్ ఈఈ రామ్మోహన్, జేఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ కవిత, ప్రిన్సిపల్ అమరేందర్ పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజిత్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి సుమారు 20 వేల మంది సిబ్బంది చాలీచాలని వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. గత నెలలో నిరవధిక సమ్మె చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికి హామీలు అమలుచేయలేదని, అందువల్ల మళ్లీ నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి శరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం రూ.32 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్యబీమా వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల ఆరో తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం తొమ్మిదవ తేదీన హైదరాబాద్‌లోని డైరెక్టర్ హెల్త్(డీహెచ్) కార్యాలయం ఎదుట మహాధర్నా కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది రేణుక మండల్, జాన్సీ, సరిత పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరోగ్యవంతమైన మహిళలతో కుటుంబం, గ్రామం, దేశం అభివృద్ధి చెందుతాయని, వారి ఆరోగ్య రక్షణకు ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప సప్త సంబరాలలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సిలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుండి 9వ తేదీ వరకు జిల్లాలో జరుగనున్న సంకల్ప సప్తాహ, అందరి ఆకాంక్ష-అందరి వికాసం కార్యక్రమంలో భాగంగా దేశంలో ఆస్పిరేషన్ బ్లాక్‌గా ఎంపిక చేయబడిన 500 మండలాలలో వారం రోజులపాటు ఒక్కో శాఖ ఒక్కో రోజు చొప్పున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ కుటుంబాలు-పోషణ మేళ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తిర్యాణి మండలం ఆస్పిరేషనల్ మండలంగా ఎంపిక చేయబడిందని, ఈ రోజు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, గర్భిణుల బరువుల పర్యవేక్షణ, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పోషణ గల కుటుంబం ప్రతి ఒక దశలో అవసరం ఉంటుందని, ప్రతి దశ నుండి మొదలు అవుతుందని, పోషణ, ఆరోగ్యం గురించి పూర్తి అవగాహన కలిగి ఉండేలా చూడాలన్నారు. కిషోర బాలికలు పోషణ సంబంధిత అవగాహన ప్రదర్శనలతో పాటు చార్ట్‌లు, రంగోలి ముగ్గులు వేశారు. రకరకాల కూరగాయలతో వాటి ప్రాముఖ్యత తెలియచేస్తూ కళా రూపంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

జిల్లాలోని ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కూలీలకు వెంటనే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి దివాకర్, ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం సిర్పూర్ తహసీల్దార్ లలితకు తెలంగాణ ఫారెస్టు నర్సరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 10 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఫారెస్టులోని మొక్కలను కాపాడడంలోనూ కూలీలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో డీఎఫ్‌ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే ప్రతినెల ఐదో తేదీలోపు వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించాలని, నర్సరీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, రవాణా సౌకర్యం కల్పించాలని, ప్రతి రోజు కూలీ రూ.600 చెల్లించాలన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు, గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, కవిత పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

దహెగాం : మండలకేంద్రంలో రోడ్డు, మురుగు కాలువ నిర్మాణానికి బుధవారం ఎంపీపీ సులోచన, జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి గ్రామ పంచాయతీలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ క్రింద నిధులు చేయగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు మండలకేంద్రంలో రూ.20 లక్షల నిధులతో రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, స్థానిక సర్పంచ్ పుప్పాల లక్ష్మీ, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మీ, కోఆప్షన్ సభ్యుడు హైమద్ హుస్సేన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, నాయకులు పుప్పాల సంతోష్, పుప్పాల శ్రీనివాస్, దందెర వెంకన్న, కారు అంజన్న, కోండ్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు బతుకమ్మ చీరలు కానుకగా స్వీకరించాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప





రెబ్బెనలో..

నవతెలంగాణ-దహెగాం

బతుకమ్మ చీరలను మహిళలు కేసీఆర్ కానుకగా స్వీకరించాలని బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపడుచులందరికి ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను కానుకగా అందజేస్తున్నారని, వీటికి ధర నిర్ణయించకుండా గొప్ప మనసుతో సంతోషంగా తీసుకోవాలన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు మహిళలను ఆడపడుచులుగా గుర్తించి కానుకలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మండలంలోని మహిళలకు సుమారు 11 వేల చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, ఆయా గ్రామ పంచాయతీల్లో త్వరలోనే పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంబగోని సులోచన, జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, సర్పంచ్ పుప్పాల లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ సులోచన, ఎంపీటీసీ జయలక్ష్మీ, ఏపీఎం చంద్రశవేశవేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు పాల్గొన్నారు.

బెజ్జూర్ : బతుకమ్మ పండుగకు ఆడబిడ్డలను గౌరవించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందని, ఈ కార్యక్రమాన్ని గౌరవించాలే తప్ప విమర్శించకూడదని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండలంలోని బారెగూడ గ్రామంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ చీరలను ఆయన పంపిణీ చేశారు. ఉచితంగా వచ్చే చీరలకు వెలకట్టకూడదని, బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకత తీసుకొచ్చింది కేసీఆర్ ప్రభుత్వమని అన్నారు. మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రూ.200 పింఛన్ నుంచి రూ.రెండు వేల పింఛన్ వరకు పెంచామని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే నాయకులు వస్తారని, వారిని నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ రేణికుంట్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, బీఆర్‌ఎస్ నాయకులు డోకే వెంకన్న, పుల్లూరి సతీష్, నాహెర్‌అలీ, మహేష్, జావిద్, రేణికుంట్ల పెంటయ్య పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో..

రెబ్బెన : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రిని బుధవారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ పంపిణీ చేశారు. అదేవిధంగా 24 గ్రామ పంచాయతీలకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం వీటిని ప్రతి గ్రామంలో యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామగ్రామానికి క్రికెట్ కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రీడా కిట్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతదేశంలోనే ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేముర్ల ప్యాక్స్ ఛైర్మన్ సంజీవ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, వైస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, సర్పంచ్‌లు సోమశేఖర్, అహల్యాదేవి, పోచమల్లు, వడాయి శాంత, శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | అక్టోబర్ 05, 2023 | www.navatelangana.com

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం నాయకులు బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. సామాజికవేత్త భూమాచారి దీక్షకు మద్దతుగా రాస్తారోకో చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జన్నారం మండల కేంద్రంలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ధర్నాలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, సీపీఐ(ఎం) నాయకులు పోతు విజయ పాల్గొన్నారు.

తపాల ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని గ్రామీణ డక్ సేవక్ తపాల ఉద్యోగులు బుధవారం సమ్మె చేపట్టారు. ఆల్ ఇండియా తపాల గ్రామీణ డాక్ సేవక్ పిలుపుమేరకు సమ్మెలో పాల్గొన్నట్లు ఎఫ్ఎంపీఓ సర్కిల్ ఆర్గనైజర్ సెక్రెటరీ అబ్దుల్ హక్ తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో దాదాపు మూడు లక్షల మందికి పైగా తపాల ఉద్యోగులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానం పెన్షన్ అదనపు ఇంక్రిమెంట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలన్న డిమాండ్లతో సమ్మెకు దిగినట్లు చెప్పారు. తపాల ఉద్యోగులు ప్రజలు సహకరించాలని కోరారు.

పాటల పాడుతూ నిరసన తెలిపిన మధ్యాహ్న కార్మికులు



నవతెలంగాణ-జన్నారం

జన్నారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాటలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు జన్నారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ వైఖరికి నిరసనగా పలు పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుండి స్పందన కరువైందని వాపోయారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు. వారికి సిఐటియు జన్నారం మండల అధ్యక్షుడు కే బుచ్చయ్య మద్దతు తెలిపారు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సహకార సంఘం భవనానికి భూమి పూజ



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంచిర్యాల నూతన భవనం, గోదాముల నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు పీఏసీ ఎస్.ఛైర్మన్ సందెల వెంకటేష్‌తో కలిసి బుధవారం భూమి పూజా చేసారు. రూ.45 లక్షల పీఏసీఎస్ నిధులతో చేపట్టే నూతన భవనం, గోదాము నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల సహకార సంఘం భవనం కమర్షియల్ ఏరియాలో ఉన్నందున ఇందులో చుట్టూ కమిర్షియల్ శెటర్స్‌తో మధ్యలో గోదాము, కట్టడం మూలంగా సంఘానికి ఆదాయం సమకూరి ఆర్థికంగా బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ ఛైర్మన్ పెంట రాజయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, సహకార సంఘం డైరెక్టర్లు బుద్ధర్తి అశోక్, చుంచు పోశయ్య, గునిగంటి భూమయ్య, రావుల లలిత, కొయ్యల కొమురయ్య, పేరం సునీత బాపు, అసిస్టెంట్ రిజిస్టర్ రవీందర్ రావు, సెక్రటరీ వెంట సత్యనారాయణ, కారుకూరి చంద్రమౌళి, రవీందర్‌రావు, మంతెనగట్టయ్య వెంకట సాయి, రాజమణి, మైనారిటీ అధ్యక్షుడు అంజద్ ఖాన్, సహకార సంఘం సిబ్బంది సుధాకర్, బాకం తిరుపతి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



నవతెలంగాణ-జన్నారం

రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. బుధవారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామంలోని రైతుల పశువులకు డాక్టర్ కిరణ్ గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం చంద్రయ్య, గోపాలమిత్ర రాజన్న పాల్గొన్నారు.

మత్స్యకారుల అర్థికాభివృద్ధే లక్ష్యం



నవతెలంగాణ-తాండూర్

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వారికి ఉచితంగా చేపపిల్లల పంపిణి కార్యాక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ అన్నారు. బుధవారం బోయపల్లి వెలువలవాని చెరువులో ప్రభుత్వం ఉచితంగా అందించిన చేప పిల్లలను తహసీల్దార్ రోహిత్‌తో చెరువులో వదిలారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా విడతల వారీగా చెరువులను అభివృద్ధి చేసిన ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి చేయూతనందిస్తుందన్నారు. గొలుసు కట్టు చెరువుల్లో చేపలు వృద్ధి చెంది మత్స్యకార కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. తాండూర్ మండలంలోని 28 గొలుసు కట్టు చెరువుల్లో ప్రభుత్వం ఉచితంగా అందించిన చేప పిల్లలు వదలడం జరుగుతుందన్నారు. సొసైటీ సభ్యులు చెరువులు కుంటల్లో నాటుసంతతికి చెందిన కొర్రమీను జెల్లా పాపార వంటి నాటు సంతతికి చెందిన చేపలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బానయ్య, ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీదేవి, మత్స్యకా సహకార సంఘం జిల్లా నాయకులు చిన్నయ్య, సర్పంచ్ భీమ సునీత, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీలో వాగ్వివాదం



నవతెలంగాణ-దండేపల్లి

ప్రభుత్వం బతుకమ్మ పంపించేస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో బుధవారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య గొడవకు దారి తీసింది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్దిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు హాజరై లబ్ధిదారులకు చీరల పంపిణీ చేశారు. అనంతరం ఆయన ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి మాట్లాడుతూ నాసిరకం చీరలు పంపిణీ చేస్తూ తెలంగాణ ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. లబ్దిదారు సైతం నాసిరకం చీరలు పంచుతున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాండూర్ : మండలంలోని బోయపల్లె గ్రామపంచాయతీలో బుధవారం జడ్పీటీసీ బానయ్య తహసీల్దార్ రోహిత్‌తో కలిసి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. జడ్పీటీసీ మాట్లాడుతూ ఆడపడుచులు సంతోషంగా బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ప్రభుత్వం ఉచితంగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. మండలంలో నిరుపేదలందరికీ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, సర్పంచ్ భీమ సునీత, ఉపసర్పంచ్ వెంకటేష్ కార్యదర్శి రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణ తీసుకుంటూ చదువు చెప్పడం గొప్ప విషయం

నవతెలంగాణ-కాసిపేట



మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకుంటూ గ్రామంలో నిరక్షరాసులకు చదువు చెప్పడం గొప్ప విషయమని అడిషనల్ కలెక్టర్ బి రాహుల్ పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సౌజన్యంతో బుధవారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అక్షర వాలంటీర్ల కుట్టు శిక్షణ పరీక్ష నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ పాల్గొని మాట్లాడారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు వారి సహకారంతో గ్రామంలో అక్షర వాలంటీర్లకు 100 రోజుల కుట్టు శిక్షణ ఏర్పాటు చేసి మూల్యాంకనం నిర్వహిస్తున్నారని మహిళలు ఉత్తీర్ణులైన వారందరికీ వృత్తి నైపుణ్య ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ ఇంతటితో ఆపకుండా వయోజన విద్యాశాఖ నేర్పిస్తున్న మగ్గం వర్క్ కూడా నేర్చుకుంటే డీఆర్డీఏ నుంచి లోన్స్ కూడా సాంక్షన్ చేస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధి కోసం వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాలని అంతేకాకుండా పొరుగున ఉన్న నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు రెడ్డి మల్ల ప్రకాశం, జిల్లా వయోజన విద్యాశాఖ ఇన్‌ఛార్జి అధికారి ఏ పురుషోత్తం నాయక్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, లైన్స్ క్లబ్ సఖి ప్రెసిడెంట్ బండ శాంకరి, పాఠశాల హెచ్ఎం రమేష్ రాథోడ్, శిక్షణ కేంద్ర ఇన్స్‌పెక్టర్ సంధ్యారాణి అక్షర పాల్గొన్నారు.

కాసిపేట-2 గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియా కాసిపేట-2వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సెంట్రల్ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ సెంట్రల్ సెక్రెటరీ, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు జీతాల పెరుగుదల సక్రమంగా జరిగాయని, కాని అనుభవం లేని కొంత మంది జీతాలు సక్రమంగా రాలేదని తప్పుడు ప్రచారం చేసిన కార్మికులే ఇప్పుడు ఆ నిజాన్ని తెలుసుకున్నారన్నారు. వేజ్‌బోర్డులో లేని వారు చెప్పే మాటలు నమ్మకండని, మన జీతాల పెరుగుదలను జీర్ణించుకోలేక కోర్టుకు వెళ్లడం కోల్ ఇండియాలో జీతాలు ఆపడం అవేదో కార్మికులకు మేమే చెల్లించినట్టు గుర్తింపు సంఘం నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్మికులు మరోసారి తప్పుడు ప్రకటనలు చేసే నాయకులను నమ్మొద్దని అన్నారు. సింగరేణిలో ఎన్నికలై రెండు సంవత్సరాలైనా ఎన్నికలు పెట్టకపోవడాన్ని ఏఐటీయుసి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే సింగరేణిలో ఎన్నికలు జరపాలని ఏఐటీయూసీ కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగం మల్లేష్, బి.వెంకటస్వామి, దాసరి తిరుపతి, గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేష్, తీర్థాల చంద్రయ్య, కొత్తపెల్లి నర్సయ్య, గోదారుల లింగమూర్తి, మైన్స్ కమిటీ సేఫ్టీ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గని కార్మికుడు మృతి

నవతెలంగాణ-జైపూర్



ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోదావరిఖని 11 ఇంక్లైన్ గనికి చెందిన గని కార్మికుడు చిలుముల అజయ్(24) మృతి చెందాడు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-6 హనుమాన్‌నగర్‌కు చెందిన అజయ్ గోదావరిఖని ఏరియాలో విధులు ముగించుకుని మోటార్ సైకిల్(నెం. టీఎస్ 22ఏ 9053)పై తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. గోదావరిఖని వైపు నుండి శ్రీరాంపూర్ వైపు ప్రయాణిస్తూ ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద ఆగి ఉన్న లారీ (నెం.ఏపీ 21 టీఈ 3324)ను వెనుక వైపు నుండి ఢీ కొట్టాడు. మృతుడి తల్లి ఓదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

గ్రామాల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-జన్నారం

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు బుధవారం మండలంలోని మహమ్మదాబాద్, మల్యాల్, దేవునిగూడ, జన్నారం, కలమడుగు గ్రామాల్లో బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించారు. ప్రతి గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం జరిగేలా చూడాలని, తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరపాలని, తడి చెత్త ద్వారా ఎరువు తయారీ చేయాలని సూచించారు. శ్మశానవాటికలో వాటి నిర్వహణ నిమిత్తం అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైన్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అవెన్యూ ప్లాంటేషన్ సరిగా నిర్వహించి అన్ని లోకేషన్లలో 100 శాతం మొక్కలు బతికేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశిస్తూ, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి, రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్త పాడే మోసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కోటపల్లి



పార్టీ కార్యకర్త చనిపోగా ఆయన పాడెను ఎమ్మెల్యే బాల్క సుమన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ మోశారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఓదెలు కుమారుడు మల్లికార్జున్ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల్లో బాల్క సుమన్, పురాణం సతీష్ పాల్గొని ఆయన పాడె మోశారు. పార్టీ కోసం మల్లికార్జున్ బాగా కష్టపడ్డారని గుర్తు చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కులం పేరుతో టికెట్లు ఆశించే వారు ఆత్మ విమర్శ చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం టికెట్టు మాదిగలకు మాత్రమే కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునిల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులం పేరుతో టికెట్టు ఆశించే వారు కులం కోసం ఏ మాత్రం పని చేస్తున్నామో ఆత్మ విమ్మర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందని పేర్కొన్నారు. కేవలం కులాన్ని చూసి ఓటు వేస్తారని అనుకోవడం పొరపాటని, అభ్యర్థి గుణాన్ని కూడా చూసి ఓటు వేస్తారనే విషయాన్ని మర్చిపోవద్దని పేర్కొన్నారు. ఏదేమైనా దళితులకు కేటాయించిన చెన్నూర్ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్టు మాదిగలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మాదిగ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు కాకుండా ఇతరులకు టికెట్టు కేటాయిస్తే మాదిగ సమాజం ఒక్కటై ఓటు ద్వారా బుద్ది చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కదారి రమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ వడ్డకొండ సంజయ్, జైపూర్ మండల అధ్యక్షులు జలంపల్లి సంపత్, అట్కపురం సమ్మయ్య, జలంపల్లి మల్లేష్, ఆసంపల్లి కిషోర్, సుందిళ్ల మల్లేష్, జలంపల్లి బానేష్, వడ్డకొండ శ్రావణ్, రేగుంట శ్రావన్, సుందిళ్ల శివమణి, గద్దల వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం బిగ్ మెషీన్ రైడర్స్ క్లబ్ అండ్ జెవి ఆర్యన్ మోటార్స్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైడర్ తుమ్మ శ్రీపాల్, విమలేష్ కుమార్, నాగరాజు మాట్లాడుతూ రోడ్డు మీద మోటార్ సైకిల్‌పై వెళుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు అతివేగంగా వెళ్లకూడదన్నారు. రోడ్డు నియమాలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యం సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని పథకాలు

• బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నవతెలంగాణ-కాసిపేట

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణాలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, మూడో సారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంను గెలిపించాలని, మరింత అభివృద్ధి చేసుకుందామని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ చీరలను, క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధి చేసుకుంటున్నామని, మూడో సారి భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకొని ఆదర్శంగా ఉందామన్నారు. సీఎం కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని, దీంతో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీడీఓ ఎంఏ అలీం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి. లక్ష్మీ, సర్పంచులు సపాట్ శంకర్, ఆడె బాదు, దేవి, రాంటెంకి శ్రీనివాస్, జంగు, తిరుపతి, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం, ఉప సర్పంచులు బోయిని తిరుపతి, పిట్టల సుమన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, కోఆప్షన్ సిరాజాన్, ఏల్పుల గంగా, ఎంపీఓ నాగరాజు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటింకి వాడేవ్, లంక లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు



నవతెలంగాణ-జన్నారం

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని జన్నారం మండలంలోని పొన్కల్ సర్పంచ్ భూమేష్, గ్రామ కార్యదర్శి రాహుల్ అన్నారు. గురువారం ఆ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో క్రీడాకారులకు, యువకులకు ప్రభుత్వం సరఫరా చేసిన సీఎం క్రికెట్ కిట్‌తో పాటు క్రీడా సామగ్రిని అందించారు. క్రీడలలో రాణించే వారికి త్వరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు.

యోగాలో కృష్ణవేణికి గోల్డ్ మెడల్



నవతెలంగాణ-తాండూర్

యూత్, స్పోర్ట్స్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఇండియా (పంజాబ్)వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా నేషనల్ ఛాంపియన్ షిప్ 2023 యోగా పోటీల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని ఖుషికి అండర్-14 విభాగంలో గోల్డ్ మెడల్ లభించింది. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం ప్రశంసించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ యోగ మన నిత్యజీవితంలో భాగం కావాలని, మన ఆరోగ్యానికి యోగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈ.రవిప్రసాద్, ప్రిన్సిపాల్ యం.రాజా రమేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు ఖుషిని అభినందించారు.

కేటీఆర్ సభకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జన్నారం

నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు జన్నారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు. నిర్మల్‌లో మంత్రి కేటీఆర్ బహిరంగ సభ సందర్భంగా బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళ్లారు.

శిశుమందిర్‌కు ఫ్యాన్ల అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు ఆ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి సన్నిహిత్ తండ్రి ప్రవీణ్ రెండు ఫ్యాన్లను పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు పాఠశాల పట్ల కృతజ్ఞత భావాన్ని కలిగి ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సభ్యుడు కొడిప్యాక వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని తపాల శాఖ ముఖ్య కార్యాలయం ఎదుట బుధవారం ఒక రోజు సమ్మె చేపట్టి ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా తపాలా ఉద్యోగులు తమ విధులను బహిష్కరించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు పేర్కొన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవు 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలన్నారు. జీడీఎస్ వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి గండ్రత్ సుజాత సంఘీభావం ప్రకటించారు.

చాందా(టి) హైస్కూల్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

నవ తెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు 6 నుంచి ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. అయితే తొలుత కొన్ని స్కూళ్లలోనే దీన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని, అందుకు పలు పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ఆదిలాబాద్ రూరల్‌మండలంలోని చాందా(టి) హైస్కూల్ ఒకటి. బుధవారం పాఠశాలను అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తా సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారట్ల జీవన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారిపై రాస్తారోకో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. సమ్మె శిబిరం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ వచ్చి రోడ్డుపై బైటాయించారు. పెండింగ్‌లో ఉన్న పది నెలల బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాస్తారోకో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

తాండూర్ : సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తాండూర్ ఐబి ప్రాంతంలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో రెడ్డి మల్లక్క, శంకరమ్మ, శారద, హనుమక్క, శాంత, తార, వరలక్ష్మి, అనూష, కళావతి, సరోజ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్నభోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా బుధవారం చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంతమ్మ, రూప, విజయ, జ్యోతి, నీలమ్మ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఉదయం ఇండ్ల నుంచి బీజేపీ సర్పంచ్‌తో పాటు మండల నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరేష్ కుమార్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచడం అప్రజాస్వామికమన్నారు. అధికార పార్టీకి అధికారులు సైతం తలొగ్గి ప్రజల చేత ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికైన ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదన్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామంలో కాళేశ్వరం 27 ప్యాకేజీ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పర్యటనలో ప్రోటోకాల్ విస్మరించారన్నారు. గ్రామంలో జరిగే కార్యక్రమానికి అధ్యక్షత వహించాల్సిన సర్పంచ్, ఎంపీటీసీల పేర్లు ఆహ్వాన పత్రిక, శిలాఫలకంపై వేయకుండా తను అవమాన పరిచారన్నారు. కాళేశ్వరం 27 ప్యాకేజీ పనులు పూర్తి కాకపోయినా ప్రారంభించిన ఘనత మంత్రి కేటీఆర్‌కే దక్కిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి విడుదల అయ్యాక బీజేపీ నాయకులంతా ఆ ప్రాంతంలో పర్యటించి అసంపూర్తి పనులు గుర్తిస్తామన్నారు. అరెస్టు అయిన వారిలో సర్పంచ్‌తో పాటు జిల్లా సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, మండల అధ్యక్షుడు శైలేశ్వర్, నాయకులు గంగారెడ్డి, దనే నర్సయ్య, ఉగ్గిరి సాయి, కోడె ముత్యం, గోపు రాకేష్, కదం సాయి పటేల్ ఉన్నారు.

అటవీ నర్సరీకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అటవీ నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ రమేష్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, రేపల్లెవాడలో పనిచేస్తున్న కార్మికులకు మూడు లక్షల పైగా వేతనాలు చెల్లించాల్సి ఉందని, వెంటనే వాటిని చెల్లించాలన్నారు. వీటితో పాటు ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే రానున్న రోజుల్లో జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, తెలంగాణ నర్సరీ ఫారెస్ట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సుధాకర్, యశోద, ప్రమీల, భాగ్యలక్ష్మి, శకుంతల, సంతోషి, కమల, నజీరా, వహీదా, సుల్తానా పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లూరు గ్రామంలో బూత్‌లెవల్ కార్యకర్తలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు భీమయ్య, మండల ఉపాధ్యక్షుడు భుజంగరావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు కాంతారావు, సత్తన్న, అనంతరావు, శోభన్, బాపూజీ, రామన్న పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ అవుట్ డోర్ గేమ్స్ ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో అవుట్ డోర్ గేమ్స్ బుధవారం మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. కెకె డిస్పెన్సరీ డివైసిఎంఓ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని మందమర్రి ఏరియాకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రవికుమార్, జనరల్ కెప్టెన్ చిన్నన్న, బాల్ బ్యాట్మింటన్ కెప్టెన్ శ్రీధర్, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మంత్రుల హామీతో సమ్మె విరమణ

మంచిర్యాలలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్



• సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్. త్రివేణి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

24 రోజుల నుండి సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు బుధవారం సమ్మె విరమించినట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 11 నుండి ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టగా, విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందన్నారు. అన్ని నిర్బంధాలను తట్టుకొని సమ్మెను విజయవంతంగా కొనసాగిస్తుండడంతో తప్పని సరి పరిస్థితులలో బుధవారం మంత్రులు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్‌లు అంగన్‌వాడి జేఏసీ, సీఐటీయూ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష, అంగన్‌వాడి ఉద్యోగులకు వీఆర్ఎస్ వర్తింపు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్‌ను అంగన్‌వాడి ఉద్యోగులకు కూడా వర్తింపచేస్తామని, సమ్మె కాలపు వేతనాలు చెల్లిస్తామని, ప్రమాద భీమా, వేతనాల పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చినందున సమ్మె విరమించినట్లు తెలిపారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని ఆమె స్పష్టం చేశారు.

మంచిర్యాల : అంగన్‌వాడీల అరెస్ట్ అప్రజాస్వామికమని, వారిని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మాత్రం విరమణకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందన్నారు. అంగన్వాడీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్ మహా ధర్నాకు వెళుతున్న అంగన్వాడీలను రైల్వేస్టేషన్‌లో, ఇండ్లలో అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి, రఫియా, పోసక్క, తిరుపతి, నారాయణ పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో మహిళ హత్య

నవతెలంగాణ-ఉట్నూర్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

గిరిజన మహిళ హత్య ఘటనను సవాళుగా తీసుకున్న పోలీసులు 24గంటల్లోనే సవాళుగా తీసుకొని కేసును చేదించారు. ఈ హత్యకు గల కారణాలను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మనోహర్‌తో కలిసి సీఐ రామకృష్ణ వివరాలను వెల్లడించారు. మండలంలోని తుకారం నగర్‌కి చెందిన మెస్రం దేవుబాయి(45) హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య జరిగిన ప్రాంతంలో పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలను ముమ్మురం చేసి నిందితుడు అదే గ్రామానికి చెందిన తోడసం శంకర్‌గా గుర్తించి అరెస్టు చేశారు. 5 సంవత్సరాల క్రితం నిందితుడు తండ్రి లక్ష్మణ్‌కు మృతురాలు మంత్రాలు చేశారని, ఇటీవల నిందితుడు కుటుంబంలో అందరూ జ్వరాలతో బాధపడుతున్నందుకు కూడా మంత్రాలే కారణామని శంకర్ భావించారు. ఎలాగైన కక్ష్య తీర్చుకుందామని అనుకొన్న క్రమంలో చేనులో సోమవారం ఒంటరిగా ఉన్న దేవుబాయిను హత్య చేసి అమెకు ఉన్న ముక్కు పుడక, పుస్తె, వెండి పట్టీలతో అక్కడి నుంచి పారిపోయడు. పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చర్యలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో పట్టుకోని ఆరెస్టు చేశారు. విచారణలో నిందితుడు తానే హత్య చేశాడని తెలిందని సీఐ తెలిపారు. ముక్కు పుడక, పుస్తె, వెండి పట్టీలను మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణంలో రూ. 8వేలకు అమ్ముకోగా రూ.5వేలు ఖర్చు అయ్యాయని నిందితుడు తెలిపినట్లు వివరించారు. నిందితుడు నుంచి రూ.3వేలు రికవరి చేసుకోవడంతో పాటుగా ఆ దుకాణంలో అమ్మిన వస్తువులను సైతం రికవరి చేసినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. 24గంటల్లో కేసును చేదించడం పట్ల సీఐ, ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ నాగేందర్ అభినందించిచారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ



నవతెలంగాణ - కౌటాల

ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్న అని అన్నారు. కానుకగా ఇచ్చే చీరకు వెలకట్టలేమని, ఆడబిడ్డలందరు బతుకమ్మ చీరలు కట్టుకొని ఆడిపాడాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, ఏపీఎం వెంకటరమణ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగకు కానుకగా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేస్తోందన్నారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సముద్రాల సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సర్పంచులు రాజన్న, శ్రీనివాస్, సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, ఏపీఎం కోనయ్య పలువురు మహిళలు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ కానుకగా ఎమ్మెల్యే కోనప్ప చీరలు పంపిణీ చేశారు. అనంతరం బాలాజీ అనుకోడ రైతువేదికలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బింకర్ నారాయణ, ఏపీఎం తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ - భీమిని

భీమిని రైతు వేదికలో భీమిని, బిట్టురుపల్లి, మల్లిడి, పెద్దపేట గ్రామాల్లోని యువకులు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మెన్ సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులు రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్త, ఎంపీడీఓ షేక్ సఫ్దర్ అలీ, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్క్ ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

బెల్లూరి అయ్యప్ప టెంపుల్ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే దిశగా పార్ ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రూ. 20 లక్షలతో పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి ఆలయ సూచనలను పాటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్. కౌన్సిలర్ సాయి ప్రణయ్, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన రాజ్ పంగే సుదాం ఇటీవల మరణించాడు. సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బుధవారం బాదిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ముందుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మోడల్ స్కూల్ చైర్మన్ రాథోడ్ సుభాష్, నాయకులు వసంత్ ఆడే, సయ్యద్ ఖాసిం, ఫిరోజ్ ఖాన్, కోరాల మహేందర్, గణేష్ ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాల పరిధిలో విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణం ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నివారణ కోసం నడుము కట్టాలని తెలిపారు. ప్లాస్టిక్‌తో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

నవతెలంగాణ-ఉట్నూర్



అబుజర్(ఫైల్)

గుండెపోటు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అబుజర్ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉండే అబుజర్(42) మంగళవారం జ్వరం వచ్చిందని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని ఆదిలాబాద్ రిమ్స్‌కు రేఫర్ చేశారు. ఇక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అబుజర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా ఉన్నాడు. అదే విదంగా క్రికెట్ ఆట ఆడుతూ అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా నిలిచాడు. ఉమ్మడి జిల్లాలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్లతో పాటుగా ఇతర రాష్ట్రాలతో జరిగిన టోర్నమెంట్లలో సైతం పాల్గొన్నాడు. అబుజర్ మృతి వార్త తెలుసుకున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

డీఈఓ కార్యాలయం ఎదుట కేజీబీవీ సిబ్బంది నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కేజీబీవీ సిబ్బంది బుధవారం విధులు బహిష్కరించి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో 24 రోజుల నిరసనలో భాగంగా ప్రభుత్వం హామీ ఇవ్వడంతో తాము నిరసనను విరమించి విధులలో చేరమని తెలిపారు. కానీ ఈ రోజు వరకు మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. ఎంటీఎస్ ప్రకటించి లిఖిత పూర్వక హామీ ఇచ్చే వరకు మా నిరసన కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది మమత, షాహిన్, అనురాధ, జ్యోతి రెడ్డి, గణేష్, రవికుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

నవతెలంగాణ-నార్నూర్

గర్భిణీ, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందేవిధంగా చూస్తామని ఐసీడీఎస్ పీడీ మిల్కా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంకల్ప సప్తహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.గర్భిణీ, బాలింతల్లో రక్త హీనత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ పీడీ మిల్కా అన్నారు. నీతి ఆయోగ్‌లో జిల్లాలో నార్నూర్ మండలం ఎంపికవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం ఇద్దరు గర్భిణీలకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, పీఏసీఎస్ ఇన్‌చారి చైర్మన్ సురేష్ ఆడే, ఎంపీడీఓ కావల రమేష్, సీడీపీఓ శారద, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, డా.రాంబాబు, ఏఓ గిత్తే రమేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరంలో అడుగు పెట్టిన విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సెకండ్ ఇయర్, ఫైనల్ ఇయర్ విద్యార్థుల అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత మాట్లాడుతూ జూనియర్లు, సీనియర్లను గౌరవించాలని, అదే విధంగా సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. తమ కళాశాలలోని అన్ని సౌకర్యాలను వినియోగించుకొని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సినీ పాటలకు తగ్గట్లుగా విద్యార్థినులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. వేదికపై ప్రదర్శనలు చేస్తున్న వారిని తోటి విద్యార్థులు కేరింతలు కొడుతూ ఉత్సాహపరిచారు. దీంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది.

నేడు వాహనాలకు వేలం పాట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆసిఫాబాద్ పరిధిలోని ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన వాహనములకు వేలం పాట గురువారం ఉదయం 11.00కు ఆసిఫాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి జోతి కిరణ్ సీఐ సయ్యద్ మోసీన్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు వాహన విలువలో 50 శాతం ఈఎండీ ముందుగా చెల్లించవలసి ఉంటుందని పేర్కొన్నారు.